క్లుప్తంగా

అవగాహనతో మెలగండి

చంద్రుగొండ: జీవనంపై అవగాహనతో మెలగాలని గొత్తికోయ ఆదివాసీలకు ఎస్సై మాచినేని రవి సూచించారు. మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి అటవీప్రాంతంలోని ఎర్రబోడును ఆదివారం ఎస్సై సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రత, కుటుంబ నియంత్రణ తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. సందర్భంగా పోలీస్ సిబ్బంది కోటేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ములకలపల్లి: ఈ నెల 9వ తేదీన కొత్తగూడెం కోర్టులో ఏర్పాటు చేసిన లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, సివిల్ కేసులు తదితర కేసులను రాజీపద్ధతి ద్వారా లోక్ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎస్సై తెలిపారు.

ప్రమాణ స్వీకారోత్సవం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ సర్వసభ్య సమావేశం ఆదివారం పట్టణంలోని శ్రీవాసవి నిత్యాన్నదాన సత్రంలో జరిగింది. ట్రస్టు సభ్యులు ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. అనంతరం నూతన కార్యనిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పచ్చిపులుసు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా బండారు కృష్ణయ్య, కోశాధికారిగా ఇల్లెందుల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొప్పురావూరి వెంకట పుల్లారావు, రేపాక రాంబాబు, చారుగుళ్ల వెంకట నాగభూషణంలు ఉపాధ్యక్షులుగా, వనమా రామారావును సంయుక్త కార్యదర్శిగా, సంకా కృష్ణార్జునరావు, శోభన్, పెనుగొండ కిషోర్లు సభ్యులుగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథి చారుగుళ్ల శ్రీనివాస్ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, యశోద రామచంద్రరావు, బ్రహ్మదేవర విజయకుమార్లు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

మణుగూరురూరల్: పినపాక మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పార్టీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు మట్టపల్లి సాగర్, మండల యూత్ అధ్యక్షుడు హర్షనాయుడు మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన విభాగ నాయకులు బండ మనోజ్ రెడ్డి, బోయిళ్ల రాజు, పవన్, పూస సంతోష్, గురిజాల ప్రశాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంఅర్బన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం భద్రాచలం పట్టణంలోని పలు హాస్టళ్లను సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. అనంతరం మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలను రానివ్వొద్దని ప్రభుత్వం, అధికారులు సర్క్యులర్లు ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ లోపాలు బయటకు వస్తాయని ముందే గమనించి సర్క్యులర్లు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భద్రాచలం పట్టణ నాయకులు పాయం ప్రవీణ్, కుంజా నవీన్, కొమరం ప్రసాద్, సోయం అనిల్, వరుస సందీప్, సబ్కా నరేష్ పాల్గొన్నారు.

గిరిజనబంధు ఏర్పాటు చేయాలి

చర్ల: దళితబంధు, బీసీబంధు తరహాలో గిరిజనబంధు పథకాన్ని ఏర్పాటు చేసి ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మామిడిగూడెంలో పార్టీ మండల కార్యదర్శి నూపా పోతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను ఏ మాత్రం అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు కొంగూరు రాము, తెల్లం లక్ష్మీనారాయణ, లక్ష్మీనర్సు, కారం సమ్మయ్య, కల్లూరి రామకృష్ణ, ఇర్పా రాంబాబు, ఇర్పా రాజబాబు, నాగరాజు, జోగయ్య, వెంకట్రావు, రామయ్య, నర్సమ్మ, ఎర్రమమ్మ, లక్ష్మి, పద్మ, అనుసూర్య తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు వితరణ

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న బాలవెలుగు పాఠశాలలకు మాజీ సింగరేణి కార్మికుడు గుంటుపల్లి రాంబాబు, మిత్రుడు దొమ్మేటి రవి సహకారంతో ఆదివారం రూ.10వేలు విలువ గల భోజన ప్లేట్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి సేవా సమితి సభ్యుడు నాసర్‌పాషా మాట్లాడారు. అనంతరం దాతలు గుంటుపల్లి రాంబాబు, దొమ్మేటి రవిలను అభినందించారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. గౌతమ్ కృష్ణ, పాఠశాల సిబ్బంది సుహాసినిదేవి, లలిత, రాధ పాల్గొన్నారు.

మసకబారుతున్న వైభవం

- గతమెంతో ఘనంగా సీఎస్ఐ పాఠశాల
- నేడు నాణ్యతలేని చదువులు
- పారిశుద్ధ్య లోపంతో పరిసరాలు
- నిర్వహణను గాలికొదిలిన యాజమాన్యం



లక్ష్మీనగరంలోని సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాల

దుమ్ముగూడెం: మండలానికి హెడ్ క్వార్టర్‌గా ఉన్న లక్ష్మీనగరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. ఉన్న సీఎస్ఐ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలపై అధికారులు, సీఎస్ఐ సంస్థ సీతకన్ను వేయడంతో అంధకారంలోకి కూరుకుపోతోంది. గతమెంతో ఘనకీర్తిలా ఉండి ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పిన సీఎస్ఐ పాఠశాల నేడు పేరుకే పాఠశాలగా కనిపిస్తోంది.

లక్ష్మీనగరం గ్రామంలోని సీఎస్ఐ పాఠశాల సీఎస్ఐ డోర్నకల్ సంఘం వారి ఆధ్వర్యంలో నడుస్తోంది. గతంలో ఎంతో అభివృద్ధి చెంది ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పిందీ పాఠశాల. ప్రస్తుతం పాఠశాల యాజమాన్యం నిర్వహణలో విఫలమైంది. ఇక్కడ విద్యార్థులకు అందించే చదువుల్లో నాణ్యత లోపిస్తోంది. దీనికితోడు పాఠశాల ప్రాంగణం మొత్తం బురదమయంగా మారి, పిచ్చి మొక్కలు మొలిచాయి. కనీస పరిశుభ్రత పాటించడం లేదు.

5 తరగతులకు ఒక్కడే ఉపాధ్యాయుడు..

ఈ పాఠశాలలో నమోదైన విద్యార్థుల సంఖ్య 37 మంది. వారిలో నిత్యం ఒక 20 మంది వరకు పాఠశాలకు వస్తున్నారు. కాగా వీరందరికీ సీఎస్ఐ సంస్థ ఒక వాలంటీర్‌ను మాత్రమే ఏర్పాటు చేసింది. పాఠశాలలో 1 నుంచి 5 తరగతులుండగా ఒక్కడే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడు. విద్యాప్రమాణాలపై దృష్టి పెట్టని సంస్థ ఇలా ఒక వాలంటీర్‌తో పాఠశాల నిర్వహణను మమ అనిపిస్తోంది. ఇంగ్లిష్ మీడియం మాట కూడా అటేపోయింది. విషయం తెలిసిన తల్లిదండ్రులు లక్ష్మీనగరం, కన్నాపురం గ్రామాల్లోని పిల్లలను లక్ష్మీనగరం గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. ఆర్థిభారమైనప్పటికీ వారికి మరోదారి కనిపించడం లేదు. కాగా, నిర్వహణ అధ్వానంగా ఉన్న సీఎస్ఐ పాఠశాల నిర్వహణను గ్రామస్తులు ప్రభుత్వ ఆధీనంలోనికి తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాల ఏది?

మండల హెడ్ క్వార్టర్ లక్ష్మీనగరంలో ఇప్పటి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేదు. అది ఉండి ఉంటే తల్లిదండ్రులకు ఇలా ప్రమాణాలు పాటించని స్కూళ్లకుగాని, ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సిన దుస్థితి కాని ఉండకపోవును. ఈ విషయంపై గ్రామస్తులు ఆందోళన చేపట్టిన ప్రతిసారీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశమయ్యి హామీలు ఇచ్చేందే తప్పా నెరవేర్పులోనికి వచ్చింది ఒక్కటీ లేదు.

ఉలుకూపలుకు లేని ప్రజాప్రతినిధులు

లక్ష్మీనగరం పేరుకు మాత్రం మండల ప్రధాన గ్రామం. అన్ని శాఖల మండల కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, నిత్యం మండలంలోని మారుమూల గ్రామాల నుంచి వేల మంది ప్రజలు రాకపోకలు ఇక్కడ కనిపిస్తుంటాయి. కానీ ప్రాథమిక విద్యను అందించే పాఠశాల లేకపోవడం ఆశ్చర్యం. పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఉన్న సీఎస్ఐ పాఠశాలను మెరుగుపరచడంలో చర్యలు తీసుకోకపోగా.. ప్రభుత్వ పాఠశాలనైనా నిర్మించడంలో వెనుకబడి ఉన్నారు. ఈ పరిస్థితిపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

నిర్వహణ అధ్వానం



గతంలో నేను ఇదే పాఠశాలలో 1 నుంచి 5 వరకు చదివాను. అప్పట్లో విద్యార్థుల కోలాహలంతో పాటు ఉపాధ్యాయులతో పాఠశాల నిర్వహణ సక్రమంగా సాగేది. కానీ ఇప్పుడు నిర్వహణ సక్రమంగా లేక పాఠశాలకు తల్లిదండ్రులు విద్యార్థులను పంపిచే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేకపోవడం ఆవేదన కలుగజేస్తోంది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని ప్రాథమిక విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాకుళపు నరసింహారావు, లక్ష్మీనగరం

భారమైనా తప్పడం లేదు



గ్రామంలో ప్రాథమిక విద్యను అందించే పాఠశాల లేకపోవడంతో మా ముగ్గురు పిల్లలను ఆర్థికభారం అయినప్పటికీ ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నాం. నాలాగే గ్రామంలోని ఇతర తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్థికభారాన్ని భరిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్నారు. ఈ విషయాల్లో జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతమున్న సీఎస్ఐ పాఠశాలకు పునర్వైభవం తీసుకునిరావాలి.

– దల్లి హరిబాబు, లక్ష్మీనగరం

హామీలు నెరవేర్చకుంటే సమ్మెబాటే..




సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా నాయకుడు భాస్కరరావు

దమ్మపేట: గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఏఐటీయూసీ జిల్లా నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ పంచాయతీ కార్మికుల సంఘం మండల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ.. గతంలో పంచాయతీ కార్మికులు చేసిన సమ్మెను విరమింపచేయడానికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదని వాపోయారు. హామీలను నెరవేర్చని పక్షంలో ఈ నెల 5వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. అయినప్పటికీ నెరవేర్చని పక్షంలో ఈ నెల 24వ తేదీ నుంచి అత్యవసరాలు అయిన తాగునీరు, విద్యుత్ సేవలను బహిష్కరిస్తూ సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు పెంకె ప్రభాకర్, ధర్మ, చెన్నారావు, బసవయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వితరణ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న క్లబ్ బాధ్యులు

ములకలపల్లి: కుమ్మరిపాడు శివారు పాములేరు వాగు ఉధృతికి గల్లంతై, మృతిచెందిన సీతమ్మ కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను వితరణగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు రాయల కేదారేశ్వరరావు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి, రూ.2,500 విలువగల బియ్యం, నిత్యావసర వస్తువులతోపాటు రూ.1000 ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, ట్రెజరర్ ఎండీ.రంజాన్, సభ్యుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

10న ‘ఇఫ్టూ’ రాష్ట్ర సదస్సు

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన ఇల్లెందులో జరిగే ఇఫ్టూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మణుగూరు ఏరియాలోని ఓబీ, బొగ్గుముఠా కార్మికులతో జరిగిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యం మాటలతో కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్ట్ కార్మికులంతా ఐక్యమై ఉద్యమించాలన్నారు. 10వ తేదీన జరిగే రాష్ట్ర సదస్సుకు కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా నాయకులు ఎండీ.గౌస్, జె.అశోక్, జానయ్య తదతరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పల్లె ప్రగతిబాట



కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణుగూరురూరల్: మండలంలోని ఉడతానేనిగుంపు, చంద్రబాబునగర్, పెద్దిపల్లి, గొల్లకొత్తూరు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కేసీఆర్ పల్లె ప్రగతిబాట కార్యక్రమాన్ని నాయకులు ముమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిని గుర్తించి ప్రజలు బీఆర్ఎస్ పార్టీని, ఎమ్మెల్యే రేగా కాంతారావును వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, లక్ష్మయ్య, ఉపసర్పంచ్‌లు ప్రభుదాస్, దయాకర్, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు వట్టం రాంబాబు, మడి వీరన్నబాబు, కంభంపాటిశ్రీను, సిద్దెల తిరుమలరావు, రమణ, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, వేర్పుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై గేదె మృతి

అశ్వారావుపేటరూరల్: మేత కోసం వెళ్లిన ఓ గేదె విద్యుత్ షాక్‌కు గురై ఆదివారం మృతి చెందింది. మండలంలోని గుర్రాల చెరువు గ్రామానికి చెందిన యారా నాగేశ్వరరావు పాడి గేదె గ్రామ సమీపంలో మేత కోసం వెళ్లి, రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వద్ద విద్యుత్ షాక్‌కు గురైంది. అక్కడిక్కడే మృత్యువాత పడింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు వాపోతున్నాడు.

ఇళ్లు కేటాయించాలి

భద్రాచలంఅర్బన్: అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లు కేటాయించాలని భద్రాద్రి రెవెన్యూ డివిజన్ ప్రజా పరిరక్షణ హక్కుల సమితి గౌరవ అధ్యక్షుడు మారెడ్డి శివాజీ, ప్రధాన కార్యదర్శి పిలకా రాము కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని నెహ్రూ మార్కెట్ వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థలం ఉండి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకాన్ని అందించాలన్నారు. భద్రాచలంలో కరకట్టను పొడిగించి, ఎత్తు పెంచి ముంపు ప్రాంత ప్రజలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిలకా లక్ష్మారెడ్డి, రాగం నిర్మలానందం, డా.నగేష్ రెడ్డి, పి.శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘జనసేన’ దిమ్మె ధ్వంసం

అశ్వారావుపేటరూరల్: జనసేన పార్టీకి చెందిన ఓ దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. మండలంలోని వినాయకపురం కాలనీ గ్రామంలో శనివారం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో జెండా దిమ్మెను నిర్మించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాగా శనివారం అర్ధరాత్రి సమయంలో ఈ దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డేగల రాము దిమ్మెను పరిశీలించారు. ధ్వంసం చేసిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లం రామకృష్ణ తెలిపారు.

నిత్యావసరాలు వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారంలోని అరీఫా–రోష్ని వృద్ధాశ్రమంలో ఆదివారం భరోసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పండ్లు, నిత్యావసర వస్తువులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బాజి, జోగు రాజు, ఖదీర్, శ్రీను, అనిల్, మనోజ్, రాంప్రసాద్, హుస్సేన్ పాల్గొన్నారు.

వనసమారాధన సందడి

అన్నపురెడ్డిపల్లి: ఆదివారం అన్నపురెడ్డిపల్లిలో వనసమారాధన సందడి నెలకొంది. గ్రామస్తులందరూ సమీపంలోని అటవీ ప్రాంతం, మామిడి తోటలకు కుటుంబాల సమేతంగా వెళ్లారు. వనదేవతలకు పూజలు చేసి, వంటలు చేసుకొని, వనభోజనాలు చేశారు. చిన్నారులు ఆటలు, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వనసమారాధనతో గ్రామంలో సందడి నెలకొంది.

అభివృద్ధిని గడపగడపకూ చేరవేయాలి



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలో రేగా కాంతారావు హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను యువజన నాయకులు క్షేత్ర స్థాయిలో గడప గడపకూ చేరవేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ సూచించారు. బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం యువజన విభాగం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో రేగా కాంతారావు గెలుపు కోసం ప్రతి యువకుడు, కార్యకర్త సైనికుల్లా తన వంతు బాధ్యతతో పని చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికి ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, మేడవరపు సుధీర్, లంకెల రమేష్, ఎస్‌కె.నయీం, మంగళగిరి రామకృష్ణ, జూపల్లి కిరణ్, యాకూబ్‌అలీ, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేగా గెలుపునకు పూజలు

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రేగా కాంతారావు గెలుపును కాంక్షిస్తూ మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ పంచాయతీలోని టేకులగుట్ట గ్రామంలోని శ్రీ కృష్ణ దేవాలయంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి రేగా కాంతారావు హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రెముచ్చు వెంకటరమణ, ఎంపీటీసీ గాదె జయ, మొండికుంట ఉపసర్పంచ్ సుధీర్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటరమణ, పీఏసీఎస్ డైరెక్టర్ రామకృష్ణ, పాటి చంద్రశేఖర్, కోటేశ్వరరావు, బలరాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పాలనపై నిరసన

దుమ్ముగూడెం: మండలంలోని నందుల చెలక గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. పార్టీ దేశవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు మర్మం చంద్రయ్య, కొండపల్లి శ్రీధర్‌లు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనలను వారి భూములను నుంచి వెళ్లగొట్టి, ఆ భూములను అదాని, అంబానీలకు కట్టబెట్టే విధంగా చట్టాలు తీసుకొచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా పేదలందరికీ గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వకుండా మోసం చేస్తోందని, అనేక మందికి తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సోయం కృష్ణమూర్తి ,సోయం రాములు, సోయం అభినేష్ ,ముదిరాజ్ కారంసీతమ్మ, సోయం వెంకటమ్మ, సోయం సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ధరల పెరుగుదల, ఉపాధి కుదింపుతో పేద, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆయన మండల పరిధిలోని రేగులగండి గ్రామంలో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గుండి రమేష్, బీమయ్య, మడకంశ్రీను, దేవయ్య, వీరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ చైర్మన్‌కు సత్కారం



ఆత్మా కమిటీ చైర్మన్ లకావత్ వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న సేవ్ భద్రాద్రి సభ్యులు

భద్రాచలంఅర్బన్: ఆత్మ కమిటీ భద్రాచలం డివిజన్ చైర్మన్‌గా ఎంపికవడంపై యల్.వెంకటేశ్వర్లును సేవ్ భద్రాద్రి సభ్యులు ఆదివారం శాలువాతో పాకాల దుర్గాప్రసాద్ నివాసం వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సేవ్ భద్రాద్రి అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు రైతులకు ఉపయోగపడే అధునాతన వ్యవసాయ పద్ధతులు, నూతన వంగడాలు, జీవ ఎరువులు, సేంద్రియ వ్యవసాయ విధానాలు, వివరిస్తూ రైతులకు మరింత ప్రోత్సాహకారిగా ఉండాలని, తగిన సలహాలు సూచనలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాకాల లక్ష్మి, చారుగుళ్ల శ్రీనివాస్, ఎస్‌కె.అజీమ్, బి.వెంకటరెడ్డి, పరిమి సోమశేఖర్, కె.అబ్రహం, పి.మునికేశవ్, జిందా, సలీం, తాళ్లపూడి రాము, కుంచాల రాజారామ్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే ఏజెన్సీ అభివృద్ధి



స్థానికులతో డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజక వర్గం అభివృద్ధి చెందాలన్నా, మరిన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలన్నా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న నన్ను ఆశీర్వదించి గెలిపించాలని డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. ఆదివారం మండలంలోని జిన్నెలగుడెం, చింతగుప్ప, సుజ్ఞానపురం, పైదిగూడెం, తోగ్గూడెం, లింగాపురం గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజలను కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు పట్టాల సమస్యను పరిష్కరించిన సీఎం కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సర్పంచ్‌లు మట్ట వెంకటేశ్వరావు, సోడి జ్యోతి, నాయకులు రాజు, కొండ్రు నర్సింహారావు, అజ్మీరా రమేష్, పాపారావు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

చింతలపాడులో పశువైద్య శిబిరం

ములకలపల్లి: మండలపరిధిలోని చింతలపాడు గ్రామంలో ఆదివారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాలమిత్రల ద్వారా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో స్థానిక పశువైద్యాధికారి పి.రామకృష్ణ పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్స అందించారు. 39 పశువులకు, 27 దూడలకు వైద్యం చేసి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోటి చెన్నయ్య, అసిస్టెంట్ సూపర్‌వైజర్ రాజేంద్రప్రసాద్, గోపాల మిత్రలు సతీశ్, నరేశ్, వీఏ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప స్వామికి బోనాలు



అన్నపురెడ్డిపల్లి: బోనంతో బీరప్ప ఆలయానికి వెళ్తున్న కురుమలు



చంద్రుగొండ: ముత్యాలమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రాజాపురంలో కురుమల ఆరాధ్య దైవం బీరప్ప స్వామికి ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకు కురుమ కుల పెద్దలు బీరప్ప స్వామికి ఆదివారం కావిడి బోనాలను ఎత్తుకుని, డిల్లం బల్లెం అంటూ.. గొంగడి బుజాన వేసుకొని డప్పులతో, బాకాలతో సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపుగా బయలుదేరారు. బీరప్ప స్వామి ఆలయానికి చేరుకుని అక్కడ బోనాలను సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ముత్యాలమ్మ తల్లికి బోనాలు..

మండలంలోని జానకీపురం గ్రామంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకుని అమ్మవారి ఆలయానికి మేళతాళాలతో చేరుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రాజు, కేశవులు, చెన్నారావు, సాత్విక్, లక్ష్మయ్య, లక్ష్మణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతకు మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా పడాలని, పాడి పంటలతో గ్రామం వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.